www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 26 ఫిబ్రవరి 2023
5
అన్నమయ్య

సోమువీర్రాజు నోరు అదుపులో పెట్టుకో : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పిచ్చెక్కి వాగుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సంపదను, ప్రజల ఆస్తులను, ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు కట్టబెట్టి, వాళ్ల మోచేతి నీళ్లు తాగి రాజకీయాలు చేస్తున్నది బిజెపి అన్న విషయం ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. నిరంతరం దేశ క్షేమం కోసం, కార్మికులు, కర్షకులు, కష్ట జీవులు అభ్యున్నతికి కృషి చేస్తూ, కార్మికులు, కష్టజీవుల సహకారంతోనే రాజకీయాలు నడుపుతున్న కమ్యూనిస్టుల గురించి మాట్లాడే అర్హత బిజెపి నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. భూ కబ్జాకు పాల్పడుతూ దళితులపై దాడులకు పాల్పడిన వీర్రాజుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా ఉండే అర్హత లేదన్నారు. గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, చినకాకాని గ్రామంలో దళితులపై గుండాలతో దాడులు చేసి, తుపాకులతో బెదిరింపులకు పాల్పడిన వీర్రాజు కమ్యూనిస్టులను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఖబడ్దార్ వీర్రాజు నోరు అదుపులో పెట్టుకోవాలని, పిచ్చికూతలు మానుకోవాలని ప్రజలు తరిమి కొట్టే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు.

వేతనాల చెల్లింపుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ఉపాధ్యాయులు, ఉద్యోగులు జీతాలు చెల్లింపులపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం పీలేరు నియోజకవర్గంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల జీతాలు సక్రమంగా చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తూందని విమర్శించారు. ఈ జాప్యానికి కారణాలేంటో బయటపెడుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల కాలంలో 20వ తేదీ వరకు వేతనాలను దశలు వారీగా చెల్లిస్తున్నారని, ఇది సరికాదన్నారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సిపిఎస్ ఖాతాల్లో వారు చెల్లిస్తున్న డబ్బులు జమ చేయకుండా, వాటిని వాడుకునే అధికారం ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణారాహిత్యమేనన్నారు. పెన్షనర్లకు పిఆర్‌సి అరియర్లు 3 వాయిదాల్లో చెల్లిస్తామని, ఇప్పటికీ ఆ ప్రస్తావన ఎత్తకపోవడం దురదృష్టకరమన్నారు. కరువు భత్యం బకాయిల 7 వాయిదాలు గత 4 సం లుగా పెండింగ్‌లో ఉంచడాన్ని వారు విమర్శించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు సదాశివరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి-రాయచోటి

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నాన్ జంబ్లింగ్ విధానంలో ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకూ రెండు దశల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి ఎం.కృష్ణయ్య అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల నుంచి 7879 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రాక్టికల్స్ పరీక్షలు సెలవు దినాల్లో కూడా నిర్వహించినున్నామని పేర్కొన్నారు. ప్రాక్టికల్స్‌కు హాజరయ్యే విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలను కూడా పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాక్టికల్ సెంటర్లను పరిశీలించినట్లు తెలిపారు. ఆర్ఎస్ఐఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే 08562 244171 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

అనంతరాజుపేట పరిసరాల్లో చిరుత సంచారం

చిరుత పాదాల గుర్తులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ లక్ష్మీనగర్ గ్రామ వెనుకన ఉన్న పొలాల్లో పులి కాలి గుర్తులు ఉన్నట్టు రైతులు, ప్రజలు వ్యవసాయ సలహా మండల జిల్లా చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే ఎఫ్ఆర్ఒ రఘునాథరెడ్డికి సమాచారం అందించి వారితో పాటు సిబ్బంది, రైతులతో కలిసి పులి సంచరించే పరిసరాలను పరిశీలించి పులి పాద ముద్రలను గుర్తించారు. అవి చిరుత పులి కాలి ముద్రలని రఘునాథరెడ్డి తెలిపారు. అనంతరం అనంతరాజుపేట సచివాలయంలో సచివాలయం సిబ్బంది వాలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బహిర్భూమికి పంట పొలాల వైపు వెళ్లకూడదన్నారు. రైతులు ఒంటరిగా కాకుండా ఇద్దరు ముగ్గురు కలిసి పొలాలకు వద్దకు వెళ్లాలని తెలిపారు. రాత్రి వేళల్లో రెండు గంటలు ఇచ్చే వ్యవసాయ విద్యుత్తును పగటి సమయాల్లో ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించారు. సచివాలయ సిబ్బంది మహిళా పోలీస్‌తో మాట్లాడుతూ గ్రామాల ప్రజలకు చిరుతపులి తిరుగుతున్నట్లు వివరించాలన్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా తిరగరాదని ముఖ్యంగా కరెంటు లేని సమయాల్లో ఇంటి నుంచి బయటకు రాకూడదని జాగ్రత్తలు తెలపాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా మరో మారు పులి సంచరించినట్టు తెలిసిన అటవీ శాఖ అధికారులకు గాని, తన దృష్టికి తీసుకురావాలని సుకుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రైతులు శ్రీధర్, సిద్దయ్య, శ్రీనివాసులు, పెంచలయ్య ఫారెస్ట్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింతలను సన్మానిస్తున్న ఎస్‌సి విభాగం జిల్లా అధ్యక్షులు రవీంద్ర

జగన్‌తోనే దళితుల అభివృద్ధి : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని దళితుల అభివృద్ధి సాధ్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వైసిపి అనుబంధ ఎస్‌సి విభాగం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన మద్దెల రవీంద్ర శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలుసుకొని పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలవతో సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో తనకు ఈ పదవి ఇచ్చిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి విజయం కోసం అహర్నిశలు శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు. ఎస్‌సిల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవరెడ్డి, రఘు, రాయుడు, సుధాకర్, వెంకటస్వామి, మహేష్, నాగార్జున, రమణ పాల్గొన్నారు.

మైనార్టీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్‌ఖాన్‌కు సన్మానం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని జిల్లా మైనార్టీ అధ్యక్షులు బేపారి మహమ్మద్‌ఖాన్ అన్నారు. శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజూర్ రహమాన్ నివాసంలో మహమ్మద్‌ఖాన్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాంత్‌రెడ్డి వెంటే ఉంటూ పార్టీకి విశేష సేవలను అందిస్తూ సమాజ సేవకు ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తూ అందరి మన్నలు పొందుతున్న వ్యక్తి బేపారి మహమ్మద్‌ఖాన్ అని పలువురు ప్రశంసించారు. భవిష్యత్తులో మరెన్నో పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సుగవాసి శ్యామ్‌కుమార్, కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్, అమీర్ ఖాన్, జావేద్, సలీం, షబ్బీర్, గువ్వల బుజ్జి బాబు, కాంట్రాక్టర్ రియాజ్, దేవేంద్ర, కొత్తపల్లి ఇంతియాజ్, మల్‌రెడ్డి, కొత్తిమీర ప్రసాద్, ఆజంతుల్లా, జిలాన్, దర్బార్, హీరా వలీ, జమీల్ ఖాన్, వేంపల్లి అమీర్ ఖాన్, జావేద్, అక్బర్, అసిపుల్లా ఖాన్, హబిబుల్లా ఖాన్, వెంకట్, కరిముల్లా పాల్గొన్నారు.

మహమ్మద్‌ఖాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

గురుకుల పాఠశాలలో జడ్జి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు

స్థానిక ప్రభుత్వ గిరిజన బాలుర గురుకుల పాఠశాలను పీలేరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం సాయంత్రం న్యాయమూర్తి గురుకుల పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించారు. వారి సమస్యలపై ఆరా తీశారు. పిల్లలకు విద్యతో పాటు భోజన సౌకర్యాలను జాగ్రత్తగా చూసుకోవాలని, వారిపై ప్రేమ, ఆప్యాయతలు చూపాలని ప్రిన్సిపల్, వసతి గృహ సంక్షేమ అధికారిణి, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాలయం పరిసరాలు సరిగ్గా లేవని, వాటిని శుభ్రంగా ఉంచుకోవాలని, లేదంటే తమ పై అధికారులకు తెలియజేయడం జరుగుతుందని హెచ్చరించారు. విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం తప్పనిసరిగా పెట్టాలని తెలియజేశారు. వారికి చదువుతోపాటు క్రీడలు కూడా నేర్పాలని చెప్పారు. ముఖ్యంగా పిల్లల ప్రవర్తనను గమనంలో ఉంచుకోవాలని అన్నారు. పిల్లల తరగతి, వసతి ఒకే హాల్లో ఉండడం విచారంగా ఉందని తెలియజేశారు. రేకుల షెడ్డులో విద్యార్థులు ఉన్నారంటే ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో మనం అర్థం చేసుకోవచ్చని, దీనిపై వెంటనే తమ ఉన్నతాధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కార దిశగా అడుగులు వేయాలని అక్కడున్న ప్రిన్సిపాల్, వార్డెన్ లకు తెలియజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పలవలి'ని ఆదర్శంగా తీసుకోవాలి

- వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పలవలి రామకృష్ణారెడ్డి చూపించిన ఆదర్శమైన దారిలో ప్రతి ఒక్కరూ నడవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు అన్నారు. భూస్వామి కుటుంబంతో సంబంధం కలుపుకుని దర్జాగా బతికే అవకాశం ఉన్నా ఆయన సిపిఎం విలువలతోనే బతికారని గుర్తు చేశారు. చివరి వరకూ ఆదర్శ కమ్యూనిస్టుగానే ఉన్నారన్నారు. పలవలి రెండవ వర్ధంతి సభ ఓ కల్యాణ మండపంలో శనివారం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పలవలి భూస్వామి కుటుంబంతో సంబంధం కలుపుకున్నా, గొప్పగా బతికేందుకు అవకాశాలున్నా సిపిఎం బాటను మాత్రం వీడలేదన్నారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ, కష్టజీవులను ఐక్యం చేసి సమసమాజ స్థాపనకు కృషి చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి బాగా చదువుకుని ఎందరో పేదలకు న్యాయవాదిగా పైసా ఫీజు తీసుకోకుండా సేవలందించారని కొనియాడారు. ఈ సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, నాయకులు సురేంద్ర, నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మధురవాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, గౌరి, సుభద్ర, ఐద్వా జిల్లా నాయకురాలు భాగ్యమ్మ, సిఐటియు మండల కార్యదర్శి గంగాదేవి పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పేద టిబి రోగులను దత్తత తీసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

పేదరికంతో బాధపడుచున్న టిబి రోగులను దత్తత తీసుకోవాలని కలెక్టర్ గిరీష పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో వైద్యశాఖ అధికారులతో టిబి రోగుల దత్తత, గర్భిణుల్లో రక్తహీనత, హైరిస్క్ ప్రెగ్నెన్సీ బర్త్ ప్లానింగ్, 10-19 సంవత్సరాల బాలబాలికలకు వైద్య పరీక్షలు, ముఖ ఆధారిత హాజరు, తదితర పలు అంశాలపై కలెక్టర్ గిరీష పిఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద క్షయ రోగులకు పౌష్టిక ఆహారం అందించడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజా ప్రతినిధులను కలిసి టిబి రోగులను దత్తత తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. టిబి రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలన్న సదుద్దేశముతో నిర్ధారిత టిబి రోగుల సమ్మతితో స్వచ్ఛంధ సంస్థలను, సేవాగుణం కలవారు మందులు వాడుచున్న టిబి రోగులకు 6 నెలలు లేదా ఒక సంవత్సరం పాటు మరింత మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి టిబి రోగులను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. రక్తహీనతతో బాధపడుతున్న ప్రతి గర్భిణులను ఆరోగ్యవంతులుగా మార్చేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో కృషి చేయాలని ఆదేశించారు. గర్భిణుకు టెస్టింగ్ వంద శాతం ఖచ్చితంగా చేయాలన్నారు. గర్భిణులకు రక్తహీనత సమస్య రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోషకాహార ప్రాధాన్యతను వివరించాలన్నారు. ఎఎన్ఎంలు క్రమం తప్పకుండా బిపి, మధుమేహం, హిమోగ్లోబిన్‌ను పరీక్షించుట (చిన్నపిల్లలకు), తదితర పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టి పక్కా ప్రణాళికతో డెలివరీ డేట్‌కు ముందే ఆసుపత్రికి తరలించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తప్పవన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించడంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ పేషెంట్ల ట్రాన్స్పోర్ట్ మీద ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీలను నాలుగు వారాలు ముందుగానే బర్త్ ప్లానింగ్ చేయించాలన్నారు. అనీమియా టెస్టింగ్ వంద శాతం జరగాలన్నారు. హిమోగ్లోబిన్ టెస్ట్ జాగ్రత్తగా చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, గురుకులాల్లో వైద్య అధికారులు విజిట్ చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. ప్రధానంగా వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేసే 10 నుంచి 19 సంవత్సరాల బాలికలకు స్క్రీనింగ్ టెస్ట్ చేయాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరు వేయాలని తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధిగా సమయానికి విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ఎన్‌సిడిసిడి సర్వే పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాన్నారు. సమీక్షలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, డిప్యూటీ డిఎంహెచ్ఒలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణ ఆపాలి

నిరసనలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎపిఎస్‌ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణ ఆపాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఎదుట సిఐటియు నాయ కత్వంతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలాల లీజు పేరుతో జరుగుతున్నది కేంద్ర ప్రభుత్వ నగదీకరణ పథకమేనని పేర్కొ న్నారు. ఆర్‌టిసికి చెందిన 100 బస్సు స్టేషన్లను 33 సంవత్సరాల లీజు పేరుతో ప్రయివేట్ సంస్థలకు, కార్పొరేట్ వ్యక్తులకు ఇవ్వాలని తీవ్ర సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ రవాణా మంత్రిత్వ శాఖ ప్రయివేటీకరణ నిర్ణయా లను ఆర్‌టిసిలో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగమే ఏటా వెయ్యి అద్దె బస్సులు, ఆర్టిఇసి బస్సుల స్థానంలో ప్రయివేటు విద్యుత్తు బస్సుల ప్రవేశం, స్క్రాపింగ్ పాలసీ, యుటిఎస్ మిషన్లు వంటివి యాజమాన్యం వేగంగా అమలుకు పూనుకుంటున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రానున్న రోజుల్లో పిపిపి పేరుతో మొత్తం సంస్థను ప్రైవేటీకరణ చేయ టానికి మాత్రమే ఈ ప్రయత్నాలు, సన్నాహాలు ముమ్మరం చేశారని తెలిపారు. వడో దర మోడల్ పేరుతో గుజరాత్‌లోని ఎంతో విశాలమైన వడోదర బస్ స్టేషన్‌ను ప్రయి వేట్ కన్సార్టియమ్లకి అప్పజెప్పి ఆ బస్ స్టేషన్‌ను అన్ని ప్రయివేట్ బస్సులు వచ్చే ఏర్పాటు చేశారని చెప్పారు. అక్కడ ఆర్‌టిసి బస్సులకు కూడా కొన్ని ప్లాట్‌ఫారం మా త్రం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఇంటిగ్రేటెడ్ బస్ స్టేషన్ల పేరుతో వీటిపై అధ్యయనం చేశారని తెలిపారు.సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులురెడ్డి మాట్లాడుతూ గుజరాత్‌కు ఒక అధికారుల బృందాన్ని కూడా పంపి వడోదరా మోడల్‌ను అధ్యయనం చేశారు. వడోదర మోడల్ అంటే అది ఒక విఫల ప్రయోగమని పేర్కొన్నారు. ప్రయివేటీకరణని వీరు అభివృద్ధి అని పిలుస్తున్నారని చెప్పారు. పబ్లిక్, ప్రయివేట్ పార్టిసిపేషన్ పేరుతో జరుగుతుందని తెలిపారు. దేశంలోని 26 ఆర్టీసీలను, రాష్ట్ర ప్రభుత్వ డిపార్ట్మెంట్లుగా నడుపుతున్నాయని చెప్పారు. ఎవరికీలేని తొందర ఆర్‌టిసి యాజమాన్యంకు వచ్చిందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఆస్తులను విలీనం పేరుతో కార్పొరేట్లకు అర్పణం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దివాకర్, కడప జోనల్ కార్యదర్శి భాస్కర్, నాయకులు పి.వి.నాదం, వైఎస్.రాజు పాల్గొన్నారు.

బస్టాండ్ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

వేడుకగా జాతీయ సైన్స్ దినోత్సవం : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఈ నెల 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఒక వేడుకలాగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో అంతర్గతంగా దాగివున్న శాస్త్రీయ వైఖరులను వెలికి తీసి వారి ప్రతిభను ప్రోత్సహించడానికి సైన్సు దినోత్సవం ఒక వేదిక కావాలని పేర్కొన్నారు. ఈ సంవత్సరం సైన్స్ దినోత్సవానికి 'ఎస్‌టిఐ యొక్క భవిష్యత్తు విద్య, నైపుణ్యాలు, పనిపై ప్రభావం' అనే ఇతివృత్తం నిర్ణయించామని తెలిపారు. ఈ ఇతివృత్తం ఆధారంగా ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల ప్రదర్శన, వక్తృత్వం, వ్యాసరచన, సైన్స్ బొమ్మల రంగవల్లులు, సైన్స్ డ్రామా మొదలగు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలోని సైన్స్ ఉపాధ్యాయులతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి బాల శాస్త్రవేత్తలకు గుర్తింపు వచ్చే విధంగా వివిధ మాధ్యమాలలో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. సైన్స్ దినోత్సవం వేడుకల నిర్వహణకు సంబంధించి తీసిన ఫొటోలలో ఒక్కొక్క పాఠశాల నుంచి ఒక ఫొటోగ్రాఫ్‌ను జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డికి వాట్సప్ లేదా మెయిల్ ద్వారా పంపాలన్నారు.

ఎఐసిసి ప్లీనరీలో అత్తింజేరి శ్రీనాథ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఛత్తీస్‌ఘర్ రాష్ట్ర రాజధాని రాయపూర్‌లో జరుగుతున్న ఎఐసిసి 85వ ప్లీనరీ సమావేశానికి అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం నుంచి పిసిసి ప్రతినిధి అత్తింజేరి శ్రీనాథ్ డెలిగేట్‌గా హాజరయ్యారు. అతి చిన్న వయస్సులో జాతీయ స్థాయి కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల్లో పాల్గొనే అవకాశం దక్కడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రంజాన్ మాసం మార్చి 23న ప్రారంభమవుతున్న సందర్భంగా రాజంపేట ముస్లిం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజంపేట ముస్లిం క్రికెట్ లీగ్ సీజన్-3 పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని అన్ని మసీదుల తరపున 9 బృందాలు ఈ లీగ్ మ్యాచ్‌లో పాల్గొంటాయని నిర్వాహకులు సిద్దిక్, యాసీన్, అలీ, అబ్దుల్ రజాక్, మౌలా తెలిపారు. ముఖ్య అతిథులుగా పట్టణ మసీదుల అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, రాజంపేట ఈద్గా డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. నిర్వాహకులు క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో హైదర్ బాషా, కె.షఫీవుల్లా ఖాన్, నవాబ్‌ఖాన్, జమీల్, మసూద్ ఖాన్, న్యామతుల్లా, గౌస్ మండె పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు

సైనిక్ ప్రవేశ ఫలితాల్లో 'శ్రీభువన' విజయం

పీలేరు: 2023-24 విద్యా సంవత్సరం సైనిక్ పాఠశాలలో ప్రవేశానికి ఆల్ ఇండియా సైనిక్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన సైనిక్ ప్రవేశ పరీక్షలో పీలేరు శ్రీభువన విద్యాలయం విద్యార్థులు అద్వితీయ విజయం సాధించారు. ఈ సందర్భంగా శ్రీ భువన విద్యాలయం కరస్పాండెంట్ జి.ఉమా రమాదేవి, ప్రిన్సిపల్ ఎ.గుణలక్ష్మి మాట్లాడుతూ తమ విద్యా సంస్థకు చెందిన 11 మంది విద్యార్థులు 6వ తరగతిలో సైనిక్ పాఠశాల ప్రవేశానికి అర్హత సాధించారని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన 11మంది విద్యార్థుల్లో బి.జ్ఞాన దీప్తి, పి.రేణుక, ఎం.రెడ్డి దీపక్, ఎ.రెడ్డి సాయిరామ్ చరణ్, పి.అనిరుద్, కె.దినేష్ కుమార్‌రెడ్డి, సి.విష్ణుతేజ, బి.ఎం.విశ్వజిత్, డి.లోహిత్ సాయి, డి.గగన్ మహీధర్ ఉన్నారన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను విద్యాసంస్థ యాజమాన్యం అభినందిస్తూ, శుభాకాంక్షలు తెలిపింది. ఈ విజయానికి కృషిచేసిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా ప్రశంసించారు. ఈ విజయాన్ని మిగిలిన విద్యార్థులు కూడా స్ఫూర్తిగా తీసుకుని ముమ్ముందు మరిన్ని మంచి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డప్ప రెడ్డి, పద్మావతి, శకుంతల, సుశీలా దేవి, సుహాసిని, సల్మా పాల్గొన్నారు.

కోలాహలం

ప్రజా'దృష్టి'

జిల్లాలో ఎన్నికల కోలాహలం మొదలైపోయింది. సరిగ్గా ఏడాది వ్యవధిలోనే 2024 సార్వత్రిక ఎన్నికలు రానుండడం అధికార, ప్రతి పక్షాలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఇంతలో ఎమ్మెల్సీ ఎన్నికలు రావడం సార్వత్రికానికి రిహార్సల్‌గా మారినట్లు పరిశీలకులు పేర్కొంటుండడం గమనార్హం. ఉమ్మడి కడప జిల్లాలో అధికార పార్టీ హవా ధాటికి ప్రతిపక్ష పార్టీలు కోలుకోలేని వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత జిల్లాలో అధికార వైసిపికి ఎదురు లేకుండా పోయింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికను ఉదాహరణగా పేర్కొనొచ్చు. నామినేషన్ ముగింపు ముందు రోజు వైసిపి అభ్యర్థి పి.రామసుబ్బారెడ్డికి పోటీ నామినేషన్ దాఖలైన సంగతి తెలిసిందే. దీన్ని స్క్రూటినీ సమయానికి చెల్లకుండా చేయడంలో కృతకృత్యులు కావడం గమనార్హం. పశ్చిమ రాయలసీమ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం లాంఛనప్రాయంగా మారింది. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్ర ఎన్నికల్లో గెలుపొందడానికి వ్యూహ రచన చేసినట్లు తెలుస్తోంది. 27,716 మంది ఓటర్లను ఆకట్టుకునేందుకు చేసిన వ్యూహరచన ఏమేరకు సఫలమవుతుందో చూడాలి. ఎన్ని పన్నాగాలు పన్నినప్పటికీ అధికార వైసిపికి ఉపాధ్యాయ, పట్టభద్ర ఎన్నికలు పరీక్ష పెట్టనున్నాయి. వైసిపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి దొంగఓట్లను ఎక్కించడం దగ్గర నుంచి ప్రలోభాల వరకు ప్రణాళిక ప్రకారం పావులు కదుపుతుండడం గమనార్హం. ప్రభుత్వ ఉపాధ్యాయుల ఓట్లకు ధీటుగా ప్రయివేటు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల పేర్లను జాబితాలో చేర్పించినట్లు తెలుస్తోంది. వైసిపి అభ్యర్థి ప్రయివేటు ఉపాధ్యాయ సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా నాయకత్వం వహిస్తుండడంతో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఇతోధికంగా సహకరిస్తుండడంపై ఆశలు పెంచుకున్నట్లు కనిపిస్తోంది. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నిక సవాల్‌గా మారనుంది. గత ఎన్నికల్లో గెలుపు దగ్గరికి చేరుకున్న ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తుండడం ఆసక్తికరంగా మారింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు విజయంపై ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుండడం అధికార పార్టీకి కంటి మీద కునుకు లేకుండా పోతోంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసిపి తరుపున గెలిచిన ఎమ్మెల్సీ గోపాల్‌రెడ్డికి చెడ్డపేరు రావడంతో ఆయన కుమారుడు రవీంద్రారెడ్డిని నిలబెట్టింది. తండ్రి ప్రభావం కుమారునిపై గణనీయంగా పడే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు అధికార వైసిపి సెమీ ఫైనల్‌గా భావించినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ జిమ్మిక్కులు పట్టభద్ర, ఉపాధ్యాయ ఎన్నికల్లో ఏమేరకు ఫలితానిస్తాయో వేచిచూడాల్సి ఉంది.

– ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరల వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రామాపురంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాలంటీర్లు, గృహసారథులు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మం గెలవాలని, మంచి వైపు ఉండాలని, న్యాయం వైపు నడవాలని అన్నారు. పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు వైసిపి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని మండి పడ్డారు. ఇప్పటివరకు 99 శాతం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను మాట ఇచ్చి తప్పకుండా నిలబెట్టుకున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. వాలంటీర్లు, గృహ సారథులు సైనికుల్లాగా పనిచేసి జగన్ చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటా తీసుకుపోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కడప విశ్వనాథరెడ్డి, మండల కన్వీనర్ జనార్దన్ రెడ్డి, సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి, మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్‌పిటిసి సభ్యుడు రమణ, జిల్లా ప్రచార కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బారెడ్డి, రేకం నారాయణ మురళీధర్ రెడ్డి, వెంకటరెడ్డి, పెద్దరెడ్డి, వడ్డెర సంఘం నాయకుడు ఆంజనేయులు, దూదేకుల సంఘం నాయకుడు హుస్సేన్, మాజీ మండలాధ్యక్షుడు నక్కా నారాయణ, ఆదినారాయణరెడ్డి, ఆదిరెడ్డి ధర్మారెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నేడు కలకడ మండల సమావేశం

కలకడ : మండల సర్వ సమావేశాన్ని ఆదివారం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సి.హెచ్.నారాయణ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి శ్రీదేవి రవికుమార్ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది తమ తమ నివేదికలతో హాజరుకావాలని తెలిపారు.

28న శ్రీగంధం సాగుపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఇస్ట్), బెంగళూరు వారితో కలిసి శ్రీగంధం సాగు పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కెవికె సమన్వయకర్త పాండురంగ తెలిపారు. ఇస్ట్ శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్ చక్రవర్తి గిరిబాబు, శ్రీగంధం నర్సరీ యాజమానులు, సాగులో మెళకువలు వంటి అంశాలపై రైతులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. శ్రీగంధం సాగులో రైతులకు ఉన్నటువంటి సమస్యలు, సందేహాలకు తగు సూచనలు ఇస్తారని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఇదేంఖర్మ కార్యక్రమంలో టిడిపి నాయకులు

వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం : టిడిపి

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని టిడిపి మండలాధ్యక్షుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పొలిమేరపల్లి గ్రామంలో ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి వెళ్ళి వైసిపి ప్రభుత్వం నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇదేంఖర్మ రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాల ద్వారా టిడిపి ప్రజల్లోకి దూసుకుపోతుందన్నారు. ప్రజల పరిస్థితులు ప్రజలకు ఎదురవుతున్న ప్రధానమైన సమస్యలను తెలుసు కొని అవగాహన కల్పించి వాటిపై చర్చ జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ప్రధానంగా ఆకాశంలో ధరలు, పేదలకు భయం, గుప్పెట్లో ఆడబిడ్డలు, నిరుద్యోగ యువత, భవిత చిత్తు, గిట్టని గిట్టుబాటు ధరలు, రైతన్నల ఆత్మహత్యలు, గుంతల మయమైన రోడ్లు, మన ఇసుక ఎక్కడికి వెళుతుందో జగన్ కే ఎరుక, నిధులు లూటీ, ప్రశ్నించిన వారిపై లాఠి, షాక్ కొట్టించే కరెంటు ధరలు, ఇలాంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతును చేస్తున్నామని చెప్పారు. నియోజక వర్గం అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో ఆర్.రమేష్‌కుమార్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, రైతు విభాగ అధ్యక్షుడు చెన్న కృష్ణ రెడ్డి, బెస్త సాధికారిక సంఘం అధ్యక్షుడు శివయ్య, గణేష్, బాలయ్య, చిన్నప్ప, రమణయ్య, సునీత పాల్గొన్నారు.

5న విశ్వహిత డిగ్రీ కళాశాలలో టాలెంట్ హంట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పుంగనూరు రోడ్డు లోని మిషన్ కంపౌండ్ ఎదురుగా ఉన్న విశ్వహిత డిగ్రీ కళాశాలలో మార్చి 5న టాలెంట్ హంట్-2023 నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ పి.ఉదయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్యాలెంట్ హంట్ సీనియర్ ఇంటర్ విద్యార్థులకు మాత్రమేనని ఇందులో కామర్స్ అండ్ అకౌంట్ సిలబస్ సంబంధించి 50 మార్కులకు, ఎకనామిక్స్ 30 మార్కులకు, ఇంగ్లీష్ 20 మార్కులకు ఉంటాయని తెలిపారు. ఇందులో ఉత్తీర్ణులైన మొదటి పది స్థానాలు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతి రూ.2 వేలు అందిస్తామన్నారు. పదిలోపు విద్యార్థులకు తగిన నగదు ప్రోత్సాహన్ని అందిస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్ నెం. 9440209459 సంప్రదించాలని తెలిపారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేయడంలో భాగంగా రెడ్డిపల్లి ఆర్ఎస్ గ్రామంలో ఉన్న గౌరీశంకర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని శనివారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ అధికారి రెడ్డెప్ప, మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గౌరీశంకర్ ఫర్టిలైజర్ దుకాణదారులు యూరియా బస్తాలను మార్కెట్ ధర కంటే అధిక ధరలు అమ్ముతున్నారని తమదృష్టికి రావడంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. దుకాణంలో రికార్డులను పరిశీలించి 120 యూరియా బస్తాలు సీజ్ చేసినట్లు చెప్పారు. మార్కెట్ ధరకంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జియాలజిస్ట్ జి.శ్రీనివాసులు, కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు, హోంగార్డ్ యుగంధర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారి రెడ్డెప్ప

మెరుగైన వైద్య సేవలందించాలి : డిఎంహెచ్‌ఒ

పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ కొండయ్య

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని సానిపాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిఎంహెచ్ఎ డాక్టర్ కొండయ్య తనిఖీ చేశారు. అక్కడ ఫామిలీ ఫిజీషియన్ విధానాన్ని పరిశీలించారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలను వైద్యులు సందర్శించి వ్యాధుల బారిన పడిన పిల్లలను గుర్తించి వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. పిల్లలకు, గర్భిణులకు వంద శాతం వ్యాక్సినేషన్ వేయాలని ఆదేశించారు. ఎఎన్ఎం రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వీరబల్లి వైద్యాధికారి డాక్టర్ వినయ్‌బాబు, రాయవరం పిహెచ్‌సి డాక్టర్ శేఖర్, మెడికల్ ఆఫీసర్‌డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిశీలనాత్మక శక్తి ఉండాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యార్థుల్లో పరిశీలనాత్మక శక్తి ఉండాలని శ్రీ ప్రత్యూష హై స్కూల్ ప్రిన్సిపల్ చందన్ బాబు పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు 'వెజిటబుల్ డే' ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు రకాల కూరగాయలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ బట్టీ చదువులకు అలవాటు కాకుండా ప్రయోగాత్మక విద్యను అందించేందుకు తమ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో ఉన్న రెడ్డమ్మ దేవత దేవస్థాన ఆలయ పునర్నిర్మాణానికి సుండుపల్లి మండలం, ముడుంపాడు గ్రామానికి చెందిన సరోజమ్మ , పొత్తపు రామచంద్రారెడ్డి రూ.50,116లు విరాళంగా అందించారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం దాతలను శేష వస్త్రమును ఇచ్చి అర్చకులు ఆశీర్వాదము అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డిసతీమణి నీరజ, దాత కుమార్తె రాణిరెడ్డి ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఇఒ మంజుల ధన్యవాదాలు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని బురకాయలకోట జడ్‌పి ఉన్నత పాఠశాల జాతీయ హరిత పాఠశాలగా ఎంపికై అవార్డు అందుకున్న విషయం విధితమే. ఈ నెల 21న ఢిల్లీలో పాఠశాల టీచర్ రెడ్డిరాధ అవార్డును అందుకున్నారు. శనివారం ఆవార్డు గ్రహీతను ఎంఇఒ వెంకటరమణ, పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పాఠశాలలో మరింత హరిత కార్యక్రమాలు జరపాలని, పచ్చదనంతో పాఠశాల కళకళలాడాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయులు అమర్నాథ్ రెడ్డి, శ్యామూల్ విజయ్ కుమార్, కమాల్‌బాష, ఆనంద్ పాల్గొన్నారు.

మండల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-నందలూరు

ఉమ్మడి జిల్లాలోని నందలూరు మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని పంచాయతీరాజ్, విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరినట్టు జిల్లా వ్యవసాయ సంఘం నాయకులు గీతాల నరసింహారెడ్డి తెలిపారు. శనివారం కర్నూలులో మంత్రిని కలిసి పలు సమస్యలపై చర్చించినట్లు గీతాల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, సహకారంతో మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమస్యలు విన్న మంత్రి ఎమ్మెల్సీ ఎన్నికలు కోడ్ అమలులో ఉన్నందున, ఎన్నికలు పూర్తయిన తర్వాత సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని నాయకులు భాస్కర్ యాదవ్, బాపనపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రాజారెడ్డి మృతి

వాల్మీకిపురం : మండలంలోని గండబోయనపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ చిచ్చిలి రాజారెడ్డి మృతి తీరనిలోటని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన రాజారెడ్డి మృతదేహాన్ని వారు సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజారెడ్డి సర్పంచ్‌గా ఉన్నప్పుడు ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. వారి వెంట చింతల ఆనంద రెడ్డి, సర్పంచ్ గుర్రప్ప, శ్రీనివాసులు, సత్తిపండు, రాజన్న ఉన్నారు.

రేడియో స్టేషన్‌లో విద్యార్థుల ప్రసంగం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక ఫ్యూచర్ మైండ్స్ పాఠశాల విద్యార్థులు శనివారం అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన 89.6 కనెక్టివిటీ రేడియోను సందర్శించి వివిధ అంశాలపై రేడియోలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇన్సిట్యూట్ ప్రిన్సిపాల్ విద్యార్థులకు జీవన విధానం అనే అంశంపై పలు సూచనలు ఇవ్వగా విద్యార్థులు ఆసక్తికరంగా విని తాము చెప్పినట్లు నడుచుకుంటామని తెలిపారు. అనంతరం రేడియో స్టేషన్ మేనేజర్ డాక్టర్ కాశి ప్రసాద్ రేడియో విశిష్టత గురించి తెలిపి అక్కడ ఏర్పాటు చేసిన సాంకేతికత గురించి వివరించారు. విద్యార్థుల ప్రసంగాలను వీక్షించి మెళుకువలు తెలిపారు. ఫ్యూచర్ మైండ్స్ పాఠశాల యాజమాన్యం నంద కిషోర్ మాట్లాడుతూ రాజంపేటలో రేడియో స్టేషన్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని రేడియోలో ప్రసంగించే అవకాశం తమ పాఠశాల విద్యార్థులకు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామాంజులు, సుజిత, చైతన్య, ఖలేషా, శివ శంకర్ లు పాల్గొన్నారు.

ఖాళీ బాండ్లపై సంతకాలు చేయరాదు : జడ్జి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఖాళీ పత్రాలు, బాండ్ల పైన సంతకాలు చేయరాదని జూనియర్ సివిల్ జడ్జి ఎం.సంధ్యారాణి సూచించారు. శనివారం మండల పరిధిలోని పోలి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రో నోట్ కాలపరిమితి మూడు సంవత్సరాలని, వ్యవధిలోపు కొంత మొత్తాన్ని జమ చేస్తూ ప్రోనోటులో రాయడం వలన మరలా మూడు సంవత్సరాలు కాలవ్యవధి పెరుగుతుందని తెలిపారు. లక్ష రూపాయలు లోపు సంవత్సర ఆదాయం కలిగిన వారు న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే న్యాయస్థానమే న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. న్యాయవాది శ్రీనివాసులు మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమని, చట్టరీత్యా ఆ వివాహాలు చెల్లుబాటు కావని తెలిపారు. ఎవరైనా వివాహం రద్దు చేసుకోదలుచుకుంటే కొట్టు ద్వారానే చేసుకోవాలని, కాగితాల పైన ఒప్పంద పత్రాలు చెల్లవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీధర్, సచివాలయ సిబ్బంది, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బెంగళూరుకు బస్సు సర్వీసు ఏర్పాటు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడు నుంచి బెంగుళూరుకు ఆర్‌టిసి బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు ఆర్‌టిసి అధికారులు పేర్కొన్నారు. శనివారం గాలివీడు బస్టాండ్‌లో బెంగళూరు సర్వీస్ బస్సును వైసిపి నాయకులు, ప్రయాణీకులు బస్సుకు పూలమాలలు వేసి బస్సును ప్రారంభించారు. రాయచోటి డిపోకు చెందిన ఆర్‌టిసి లగ్జరీ సర్వీసును గాలివీడు మీదుగా పెద్దమండ్యం, తంబళ్లపల్లి, బి.కొత్తకోట, ములకలచెరువు చింతామణి మీదుగా బెంగళూరుకు చేరుకుంటుందని అన్నారు. రాయచోటిలో ఉదయం 6 గంటలకు బయలుదేరి బెంగళూరుకు మధ్యాహ్నం 12 గంటలకు చేరుతుందన్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి రాత్రి 9 గంటల లోపు గాలివీడుకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో డిపో సిఐ సుబ్బమ్మ, వైసిపి నాయకులు సుధాకర్‌రెడ్డి, పంచాయతీ మెంబర్ కరీంరెడ్డి, విశ్వనాథరెడ్డి, మాజీ మెంబర్ బయ్యారెడ్డి మానవతా సంస్థ కార్యదర్శి దామోదర, వైసిపి ఎస్‌సి సెల్ కార్యదర్శి ప్రసాద్, గుడ్లమెట్ల సాయి ప్రసాద్‌రెడ్డి, పాపయ్య, గంగాధర నాయుడు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొడదాం : ఆర్ఆర్

ప్రజాశక్తి-రాయచోటి

అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని తరిమికొడదాం, ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం శిబ్యాలా పంచాయితీలోని కొత్తవాండ్లపల్లె, తురకపల్లె ,చౌటపల్లె, వైకుంఠరాచపల్లె, శిబ్యాల కస్పా, రెడ్డివారిపల్లెలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అరాచకాలు, అవినీతి అక్రమాలు, ధరల పెంపుదల తదితర ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాయచోటి రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి , అనుపల్లె రాంప్రసాద్‌రెడ్డి, టిడిపి రూరల్ కో-ఆర్డినేటర్ బొజ్జ రామ్‌భూపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ చిన్నారి వెంకటరమణ, జయరామరాజు, గంగిరెడ్డి, మాజీ సర్పంచ్ విజయమోహన్‌రాజు, బషీర్‌ఖాన్, సర్పంచ్ పల్లెపువాసు, నాగేంద్రరెడ్డి, బలరామరాజు,వేణుగోపాల్‌రెడ్డి, రాజు, బసయ్య, భూపతి యాదవ్, చిన్నావుల వెంకట్రామిరెడ్డి, విజయ్‌కుమార్‌రాజు, మదన, సురేష్ రాజు పాల్గొన్నారు.

చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెంచాలి

గాలివీడు : చిన్నపిల్లల్లో ఇమ్యునైజేషన్ ప్రక్రియ పెంచి చిన్నారుల్లో రోగనిరోధక శక్తిని పెంచాలని జిల్లా గణాంక అధికారి ఓబుల్‌రెడ్డి, ఎఎస్‌ఒ రాజేష్‌లు పేర్కొన్నారు. శనివారం గాలివీడు సచివాలయం-1ను ను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు నెలలకు ఒకసారి జరుగుతున్న ఇమ్యునైజేషన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో క్రమంగా తప్పకుండా ఇమ్యునైజేషన్ ను చురుగ్గా జరిపించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్, పిహెచ్‌ఎన్, ఏఎన్ఎం సుశీల, ఆశావర్కర్లు సుప్రజ, పరమేశ్వర, సుల్తాన్‌బీ పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎఒ ఉమామహేశ్వరమ్మ

ఇ-పంట నమోదు పూర్తి చేయండి : ఎఒ

కలికిరి : ఇ-పంట నమోదును వెంటనే పూర్తి చేయాలని డివిజనల్ వ్యవసాయ అధికారిని ఉమామహేశ్వరమ్మ సచివాలయం అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె మండలంలోని మేడుకురి, మర్రికుంటపల్లి రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంటనమోదు, ఇకెవైసి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి చేయలేని పక్షంలో ఆదివారం కూడా పని చేసి పంట నమోదు ఇకెవైసి పూర్తి తెలిపారు. అనంతరం గ్రామంలో రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని మమతారెడ్డి, మేడుకుర్తి వి.ఎ.త్రిశూల్, మరికుంటపల్లి, విహెచ్ఎ రోషన్ ఆరా, రైతులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో చదువుతున్న విద్యార్థులు సంధ్యారాణి, ఐశ్వర్య సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సబితా, ఫిజికల్ డైరెక్టర్ అబ్దుల్ కరీం తెలిపారు. ఇటీవల జరిగిన సాఫ్ట్ బాల్ పోటీలలో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి ఆల్ రౌండ్ ప్రతిభ తో సౌత్ జోన్ రాష్ట్రల సాఫ్ట్ బాల్ జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు.

క్రైం కార్నర్

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-రామాపురం

భార్య కాపురానికి రాలేదని మండలం లోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లికు చెందిన పి.రాజా శనివారం మధ్యాహ్నం ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్ళిన భార్య తిరిగి సంసారానికి రాకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విష ద్రావణం తాగి మరో మహిళ..

రాజంపేట అర్బన్ : పట్టణ పరిధిలోని బలిజపల్లిలో గల పూసల వీధిలో చిన్న రెడ్డమ్మ (25) అనే మహిళ శనివారం సూపర్‌వాస్మోల్ విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రావాల్సి ఉంది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని 108 వాహనంలో పంచనామాకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

400 లీటర్ల నాటు సారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి-కలకడ

నాటుసారా ఊటను పరిశీలిస్తున్న పోలీసులు

నాటు సారాయి తయారు చేయడానికి ఉంచిన 400 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు కలకడ సిఐ నాగేంద్ర తెలిపారు. మండలంలోని ఏనుగొండ పాలెం పంచాయితీ ఎగువ తాండ గ్రామ సమీపంలో నాటు సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న సిఐ కలకడ, కెవిపల్లి, గుర్రంకొండ ఎస్ఐలు తమ సిబ్బందితో కలిసి శనివారం ఉదయం నాకాబంది నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఎగువతాండా పరిసర ప్రాంతాల్లో నాటు సారా తయారు చేయడానికి ఉంచిన 400 లీటర్ల ఊటను ధ్వంసం చేయగా, ఈ క్రమంలో నాటు సారా తయారు చేస్తున్న గ్రామ సరిహద్దుల్లో 10 లీటర్ల నాటుసారా లభించినట్లు తెలిపారు. నాటు సారా తయారు చేసిన వ్యక్తులు తాము వస్తున్న విషయం గమనించి పరారైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సిఐ మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా నాటుసారా తయారు చేయడానికి ప్రయత్నించినా, సరఫరా చేసిన ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కలకడ, గుర్రంకొండ, ఎస్ఐ తిప్పేస్వామి దిలీప్ కలకడ, కెవిపల్లి, గుర్రంకొండ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాజంపేట అర్బన్ : గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై జరిగింది. స్థానికుల వివరాల మేరకు..శనివారం తెల్లవారుజామున ఫ్లైఓవర్ బ్రిడ్జి పైన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తిప్పన మోహన్‌రెడ్డి(46)అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం పాదచారులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు మోహన్‌రెడ్డి తిప్పాయపల్లె గ్రామస్తుడని, బెంగళూరు నుంచి వస్తున్న తన పెద్ద కుమార్తెను తీసుకొచ్చేందుకు రాజంపేటకు వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి సిఐ మల్లిక తెలిపారు. సిఐ వివరాల మేరకు.. మండలంలోని చౌడసముద్రంలో కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిఐ ఆదేశాల మేరకు ఎస్ఇబి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చౌడసముద్రం క్రాస్‌లో గుత్తావారిపల్లితాండకు చెందిన కృష్ణనాయక్ నుంచి 96 కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది లింగమూర్తి నాయక్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ ఢీ

ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మృతి చెందిన రాము

ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం-ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని విఠలం వారిపల్లి వద్ద చోటు చేసుకొంది. వివరాలు.. వాల్మీకిపురం పట్టణానికి చెందిన మనోహర్, మండలంలోని చింతపర్తి పంచాయతీ చెరువు ముందరపల్లికి చెందిన రాము, రాయచోటికి చెందిన రమేష్‌లు ద్విచక్రవాహనంపై సోమల మండలం కందూరుకు వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని వాల్మీకిపురం మండలం గండబోయనపల్లి సమీపంలోని విఠలంవారిపల్లి వద్ద ద్విచక్రవాహనం-ట్రాక్టర్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా, రాముకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానిక హుటాహుటిన క్షతగాత్రులను 108లో వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రామును మదనపల్లికి రెఫర్ చేశారు. మదనపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ బిందుమాధవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్.ఓ.సి.నెం.1394/E1/2020 తేది: 22.02.2023

మదనపల్లె పురపాలక సంఘము

ఈ-ప్రొక్యూర్మెంట్ షార్టు టెండరు నోటీసు

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకు గాను ఈ-ప్రొక్యూర్మెంటు ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

వ. నెం	Funds	Tender ID Nos	పనుల సంఖ్య	పని అంచనాల మొత్తము (ECV)
1	Gen.funds	596692, 596602, 596624, 596700	4	11.14 లక్షలు

పై పనులకు సంబంధించిన పూర్తి వివరముల కొరకు వారి e Procurment market place నందు చూడవలెను మరియు ఆఫీసు పనివేళలలందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు మొదలు తేది : 23.02.2023: 11.00 AM
బిడ్ డాక్యుమెంటు డౌన్ లోడ్ చేసుకొనుటకు చివర తేది : 02.03.2023: 11.00 AM
బిడ్ డాక్యుమెంటు స్వీకరించుటకు చివర తేది : 02.03.2023: 11.15 AM

షరతులు : ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దుపరచుటకు/ నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

కమీషనరు
మదనపల్లె పురపాలక సంఘము.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PILER.
O.S.No. 321/2019

U.Ramanaiah, S/o U.Muneppa, D.No.1-500, Kadapa Road, Piler Town and Mandal, Annamayya Dist.
...Plaintiff
Vs
R.Sujatha, W/o R.Janardhan Reddy, D.No.2-1824, Kadapa Road, Piler Town and Mandal, Annamayya Dist.
...Defendant

వాది మీ పైన రికవరీ ఆఫ్ మనీ గురించి పై కోర్టు నందు దావా దాఖలు చేసివున్నారు. ఇందు విషయమై మీకెలాంటి ఆక్షేపణలు వున్న యెడల తేది: 28.02.2023న ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు నందు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని హాజరై తెలుపుకొనగలరు. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

//By Order Of the Court//
ఆర్. చంద్రశేఖర్
అడ్వకేట్,
పీలేరు.

మహారాజశ్రీ పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S.No. 04/2021

పుట్టా వెంకటరెడ్డి & మరొకరు. ...Appellants
Vs
వేలూరి చెంగాల్రాయులు (died) మరియు మరికొందరు.
...Respondents

రెస్పాండెంట్స్ 2 నుండి 6 వారికి అప్పీల్ నోటీసు
2. వేలూరి గురుమూచర్తి, S/o వెంకటప్ప.
3. వేలూరి చెంగమ్మ, W/o లేట్ వేలూరి చెంగాల్రాయులు,
4. పి.రెడ్డెమ్మ, W/o పి.వెంకటరమణ,
5. సి.కె.రెడ్డెమ్మ, W/o సి.కె. శ్రీనివాసులు,
6. వేలూరి రెడ్డెప్ప, S/o లేట్ వేలూరి చెంగాల్రాయులు
అందరి నివాసం గుర్రంవారిపల్లి, రేగల్లు మజరా, అగ్రహారం పోస్ట్, పీలేరు మండలం, అన్నమయ్య జిల్లా.

పై అప్పిలెంట్స్ దాఖలు చేసిన పై అప్పీలు నందు మీ నోటీసు నిమిత్తమై పై కేసును తేది: 10.03.2023న వాయిదా వేసి వున్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 10.03.2023 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను, లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియచేయడమైనది.

//By Order Of Court//
సి.వెంకటరమణ రెడ్డి, B.Com.,B.L.,
న్యాయవాది, పీలేరు.

పాసుపోర్టు పోయినది

కె.వి.పల్లె మండలం, నూతనకాల్వ గ్రామ పంచాయతీ, తుమ్మలవాండ్లపల్లెకు చెందిన దేవ చందన అను నేను 10-11-2022వ తేదీన మా గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళుతూ మార్గం మధ్యలోని వగళ్ల వద్ద నేను నాకు చెందిన పాసుపోర్టు నెం. (K8583851) ఎక్కడో జారి పోయిందని గుర్తించాను. వచ్చిన దారిలో ఎక్కడ వెతికినా కనబడలేదు. ఎవరికైనా నా పాసుపోర్టు దొరికినచో ఇవ్వగలరు.
సెల్ నెం: 7816010094.